
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం। 15। నవంబర్। 2023



సోమశిలలో 29.720 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 29.720 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 112 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	- రూ.61,930
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,562
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,729
సవర (8 గ్రా)	- రూ.45,832

గరిష్టం/కనిష్టం
28.3 /25.5

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 73 శాతం ఉంది. బుధవారం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి 'జగనన్నకు చెబుదాం' వాయిదా

• ఉదయగిరిలో 22న కార్యక్రమం

నెల్లూరు(దర్గామిట్ట): ఉదయగిరిలో బుధవారం జరగాల్సిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం తెలిపారు. కులగణనకు సంబంధించి అధికారులకు, స్టేట్ హోల్డర్లకు శిక్షణ కార్యక్రమం ఉన్నందున, బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 17న దుత్తలూరులో నిర్వహించాల్సిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం 24వ తేదీన, ఈ నెల 22న ఉలవపాడులో నిర్వహించాల్సిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని 27వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి ఆయా తేదీల్లో అర్జీలతో వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రైమ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం



నెల్లూరులో ప్రైమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ తదితరులు

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్లు జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 65 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అత్యధికంగా బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 11 డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో జరిగాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న ఈ ప్రక్రియను జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పరిశీలించారు. కోవూరు, కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో చాలా చోట్ల బుధ, గురు వారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను ఆనుకుని అల్పపీడనం ఉందని, ఇది బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారనుందని తెలిపారు. దీని ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట





ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, హాజరైన ప్రజాప్రతినిధులు

- పెన్నార్ డెల్టాకు సాగునీరు
- 2.20 లక్షల ఎకరాలకు సోమశిల జలాలు
- 20 నుంచి సాగునీరు విడుదల చేసేలా ఐఏబీ సమావేశంలో నిర్ణయం
- నీటి లభ్యతను బట్టి ఉత్తర, దక్షిణ, కావలి, కనుపూరు కాలువలకు కూడా
- బెడిసికొట్టిన బహిష్కృత ఎమ్మెల్యేల హైడ్రామా
- ఎమ్మెల్యే ఆనం ప్రసంగంపై రైతుల అసహనం

సాక్షిప్రతినిధి, నెల్లూరు: రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమశిల జలాశయంలో ప్రస్తుతం ఉన్న 29.8 టీఎంసీల నీటిని పెన్నార్ డెల్టాలో మొదటి పంటకు అందించేలా జిల్లా సాగునీటి సలహా మండలి నిర్ణయం తీసుకుంది. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సారథ్యంలో, కలెక్టర్ హరినారాయణన్ అధ్యక్షతన ఐఏబీ సమావేశం జరిగింది. 2023–24 రబీ సీజన్‌లో డెల్టా ప్రాంతంలో సాగయ్యే 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా తీర్మానించారు. ఈ నెల 20వ తేదీ నుంచి సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించారు. అలాగే రాబోయే రెండు నెలల వ్యవధిలో జలాశయానికి వచ్చే వరద జలాల నీటి లభ్యతను బట్టి ఉత్తర, దక్షిణ, కావలి, కనుపూరు కాలువల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో 51 శాతం వర్షపాతం మాత్రమే నమోదు కావడంతో మొదటి పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇచ్చే పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉండడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నేతల సలహాలు, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయం చేస్తూ మంచినీటి అవసరాల చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గొడవలు సృష్టించాలనే..

అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ గొడవలు సృష్టించాలని వచ్చిన వారు అసహనానికి లోనై రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లిపోవడం ఎంత వరకు సబబో రైతులు, ప్రజలు ఆలోచించాలన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ పునాది వేసిన ప్రాజెక్టులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ బీఫామ్‌పై వైఎస్ జగన్ చరిష్మాతో గెలిచి నాలుగేళ్ల ప్రభుత్వంలో ఉండి ఇన్ని రోజులు గుర్తుకు రాని రైతుల ప్రయోజనాలు పార్టీ మారిన తర్వాత గుర్తుకొచ్చాయా అని ఆనంను ఉద్దేశించి విమర్శించారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, ఆప్కాబ్ చైర్మన్ అనిల్‌బాబు, ఇరిగేషన్ ఎస్‌ఈలు కృష్ణమోహన్, హరినారాయణరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఆర్డీఓలు మలోలా, శీనా నాయక్, మధులత, ఇతర ప్రజాప్రతినిధులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

బహిష్కృత ఎమ్మెల్యేల హైడ్రామా

టీడీపీ నాయకులు ఆందోళనలు చేస్తారనే ముందస్తు సమాచారంతో పోలీసు అధికారులు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించకుండా తనిఖీలు నిర్వహించారు. టీడీపీ నాయకులు దొడ్డిదారిన వచ్చి జెడ్పీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఐఏబీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలైన ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జిల్లా రైతులపై లేని ప్రేమను ఒలకబోస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల 20 టీఎంసీల నీరు వృథాగా పోయిందని, పంట కాలువల పూడికతీత పనుల్లో ఉపాధి నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి ఇతర అంశాలను లేవనెత్తి అధికారులు ఇచ్చిన సమాధానాలపై అసహనం వ్యక్తం చేస్తూ సరైన సమాధానాలు ఇవ్వలేదంటూ వాకౌట్ చేశారు. ఆనంకు వత్తాసు పలుకుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇద్దరు రైతు సంఘ నాయకులు ఆయనను అనుసరించారు. వాస్తవానికి ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, ఎండతీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో నీటిఆవిరి శాతం గతంలో కన్నా రెట్టింపు అయింది. దీని వల్ల సాగునీటి వినియోగం అధికంగా ఉంది. రెండో పంట విషయానికొస్తే జలాశయం పరిధిలో పెన్నార్ డెల్టా, నాన్ డెల్టా పరిధిలో 3.11 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకున్నారు. వాటికి 37.5 టీఎంసీల నీటిని వినియోగించారు. ఈ ఏడాది వరి పంట పుష్కలంగా పండింది. కానీ రైతులు ఆనందంగా ఉంటే సహించలేని టీడీపీ నేతలు పంటలకు సాగునీరు అందక నష్టపోయారని ఆరోపిస్తూ ప్రభుత్వంపై బురదజల్లేలా మాట్లాడారు. పంట కాలువల పనులు ఉపాధి నిధులతో చేసి ఇరిగేషన్ శాఖలో ఆ పనులకు బిల్లులు పెట్టుకున్నారని ఆరోపణలు చేశారు. వాస్తవంగా ఉపాధి నిధులతో పనులు చేస్తే పనిచేసిన వ్యక్తి వ్యక్తిగత ఖాతాలోనే నగదు జమ అవుతుంది. ఇరిగేషన్‌శాఖ బిల్లులు చేసుకున్న దాఖలాలు లేవు. అలాగే నెల్లూరు, సంగం బ్యారేజీలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి చేసి స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తే ఆ ప్రాజెక్టులపై కూడా పసలేని ఆరోపణలు చేసి సభలో చులకన అయ్యారు.

కండలేరుకు 5 టీఎంసీల పరిశీలన

కండలేరు జలాశయంలో ప్రస్తుతం 11.3 టీఎంసీల నీరు ఉన్న నేపథ్యంలో డెడ్ స్టోరేజ్ 8.4 టీఎంసీలు పోగా 3.4 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంటాయి. ఇందులో తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు, రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణ తాగునీటి అవసరాలకు పోను కండలేరు పరిధిలో గల చెరువులు, పాడి పశువుల నీటి అవసరాలకు 3 టీఎంసీలు, తాగునీటి పథకాలకు 0.4 టీఎంసీలు, పరిశ్రమలకు 1.2 టీఎంసీలు ఇవ్వాల్సిన నేపథ్యంలో కండలేరుకు దాదాపు 8 టీఎంసీల నీటిని సోమశిల నుంచి సరఫరా చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో తెలుగుగంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి ప్రతిపాదించారు. సోమశిల జలాశయంలో ప్రస్తుత నీటి నిల్వలో పెన్నార్ డెల్టాకు సాగునీరు, జిల్లా ప్రజల తాగునీరు, ఇతర అవసరాలను పరిశీలించి కండలేరు జలాశయానికి కనీసం 5 టీఎంసీలైనా విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కాకాణి తెలిపారు.

నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలి



ఆత్మకూరు నియోజకవర్గ రైతులు, ప్రజల ప్రయోజనాలు, అవసరాలు దృష్టిలో ఉంచుకుని కేటాయించిన నీటిని పూర్తి స్థాయిలో విడుదల చేసేలా చర్యలు చేపట్టాలి. రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలి. తాగునీటి అవసరాలకు కేటాయింపుల్లో అన్ని ప్రాంతాల పేర్లు చేర్చాలి.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే

స్వర్ణముఖికి నీరివ్వండి



గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల రైతులు, ప్రజల అవసరాల దృష్ట్యా స్వర్ణముఖికి నీటిని విడుదల చేయాలి. చెరువులకు నీటిని విడుదల చేయడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. రెండు ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్సీ

1.25 టీఎంసీలు ప్రాజెక్టుకు చేరాలి



రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల ప్రాజెక్టు నుంచి 1.25 టీఎంసీలు విడుదల చేస్తున్నట్లు అధికారులు లెక్కల్లో చూపుతున్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదు. ఈ విషయంపై అనేక పర్యాయాలు చర్చించినా ఫలితం లేదు. కేటాయించిన 1.25 టీఎంసీలు ప్రాజెక్టుకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నియోజకవర్గంలో మరమ్మతులకు గురైన అనేక చెరువులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి.

– మానుగుంట మహీధర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే

చెరువులను నీటితో నింపండి



పెన్నార్‌డెల్టా ప్రాంతంలో కావలి నియోజకవర్గంలోని అల్లూరు, దగదర్తి మండలాలు ఉన్నాయి. కావలి ప్రాంతంలోని రైతులు నార్లు పోసి ఉన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కావలి ప్రాంత చెరువులకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి. దీనిపై అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే

5 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంచొచ్చు



సోమశిల ప్రాజెక్టులో అధికారులు డెడ్‌స్టోరేజీ నీటిని అధికంగా చూపించారు. ఐదు టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంచొచ్చు. గతంలో ఇదే పరిస్థితుల్లో డెడ్ స్టోరేజీని తగ్గించి నీటిని విడుదల చేశారు. ముందుగా పెన్నార్ డెల్టాకు నీటిని విడుదల చేసిన తర్వాతే ఇతర ప్రాంతాలకు చేయాలి. సోమశిల ప్రాజెక్ట్ నిర్మించక ముందే డెల్టా ప్రాంతం ఉంది. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే


సామాజిక సాధికార యాత్ర వాయిదా

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరులో ఈ నెల 16వ తేదీన నిర్వహించాల్సిన సామాజిక సాధికార యాత్రను వాయిదా వేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పొదలకూరులో మంగళవారం మంత్రి మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాన్ని దృష్టిలో ఉంచుకుని యాత్రను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మంగళవారం ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. కందుకూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బి.జనార్దన్ అదే మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులయ్యా రు. కావలి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరామిరెడ్డి కావలి ఎంఎల్ఎస్ పాయింట్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ప్రముఖులు



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరుకు విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం స్వాగతం పలికారు. అలాగే విజయసాయిరెడ్డితో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువులకూ సరోగసీ

ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ సాంకేతికతతో మేలు జాతి దూడల ఉత్పత్తి

మనం ఇప్పటి వరకు మనుషుల్లో మాత్రమే సరోగసీ (అద్దె గర్భం) విధానంలో పిల్లలను కనడం గురించి విన్నాం.. అయితే పశువుల్లోనూ అద్దె గర్భం ద్వారా సంతాన ఉత్పత్తి కోసం శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఫలించింది. దేశవాళీ పశువుల ద్వారా అధిక పాల ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సరోగసి విధానం విజయవంతమయింది. మేలైన పశువుల సంతతిని పెంచేందుకు 'ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్' సాంకేతికతను చింతలదేవి జాతీయ కామధేను పునరుత్పత్తి (బ్రీడింగ్) కేంద్రంలో శాస్త్రవేత్తలు అమలు చేస్తున్నారు. నాణ్యమైన పశువుల వీర్యాన్ని, అండాన్ని సేకరించి పిండాభివృద్ధి చేస్తున్నారు. దీన్ని పశువుల గర్భంలోకి ఎక్కించి దూడలకు జన్మనిచ్చేలా చేస్తున్నారు.



- చింతలదేవి కామధేను పునరుత్పత్తి కేంద్రంలో ఫలించిన శాస్త్రవేత్తల కృషి
- అధిక పాల దిగుబడితో రైతులకు మేలు
- సత్ఫలితాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

సాక్షి, నెల్లూరు డెస్క్: నెల్లూరు జిల్లాలో రైతులు ఎక్కువ మంది వ్యవసాయం తరువాత పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం మేలు జాతి పశువులు కొనుగోలు చేయాలంటే రూ.లక్షల్లో వ్యయం చేయాల్సి వస్తోంది. దాంతో చాలామంది నాటు పశువులనే పెంచుకుంటూ వాటి ద్వారా వచ్చే అరకొర ఆదాయంతోనే జీవితాలను వెళ్లబుచ్చుతున్నారు. వీరి ఆదాయాన్ని పెంచేందుకు చింతలదేవి వద్ద ఏర్పాటు చేసిన జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రంలో చేపట్టిన ప్రయోగాలు సత్ఫలితాలు ఇచ్చాయి. పశువుల్లో సరోగసీ (అద్దె గర్భం) విధానాన్ని ఇక్కడ ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఎంపిక చేసిన మేలు జాతి గేదెల నుంచి అండాన్ని సేకరించి మేలు రకమైన పశువుల వీర్యం (స్పెర్మ్)తో ఒక కొత్త పిండాన్ని ఉత్పత్తి చేస్తారు. వీటిని రైతులు పెంచుతున్న పశువుల గర్భంలోకి చొప్పించి దేశీయంగా కొత్త రకమైన దూడలను ఉత్పత్తి చేస్తున్నారు. జిల్లాలోని చింతలదేవి కేంద్రం పరిధిలో ఇప్పటి వరకు 30కి పైగా పిండాలను దేశవాళీ పశువుల్లో చొప్పించారు. సరోగసీ ద్వారా భారీగా పాల ఉత్పత్తులను పొందుతున్న అమెరికా, బ్రెజిల్ వంటి దేశాల విధానాలను మన రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నారు.

ఆవుల్లో అద్దెగర్భం ఇలా..

సాహివాల్ దేశీ జాతి గిత్త నుంచి సేకరించిన వీర్యాన్ని ప్రయోగశాలలో ఫలదీకరణ చేసి ఆ పిండాలను జెర్సీ ఆవు గర్భంలో ప్రవేశపెడుతున్నారు. దేశవాళీ సాహివాల్ లక్షణాలతో జన్మించిన దూడలు ఎదిగిన తర్వాత మొదటి ఈతలో సుమారు 3వేల లీటర్ల పాలు ఇస్తాయని వైద్యులు అంచనా వేస్తున్నారు. రెండో ఈతలో 5 వేల నుంచి 6 వేల లీటర్లు.. అంటే రోజుకు 15 నుంచి 20 లీటర్ల పాలు పొందే అవకాశాలుంటాయని చెబుతున్నారు. అధికంగా పాలిచ్చే ఆవుల అండాలను సేకరించి ప్రయోగశాలలో ఫలదీకరణ చేస్తున్నారు. అనంతరం 7 రోజుల పాటు ఇంక్యుబేటర్‌లో పెడుతున్నారు. వాటిని ఆరు నుంచి ఏడు రోజులు ఎదలో ఉన్న ఆవుల గర్భంలో ప్రవేశపెట్టి ఫలితాలను సాధిస్తున్నారు.



కామధేను బ్రీడింగ్ సెంటర్

ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్ సాగేదిలా..

ఎంపిక చేసిన గేదె లేదా ఆవు నుంచి అండాలను సేకరించి వాటిని ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్‌తో మేలు జాతి ఆబోతు లేదా దున్నపోతు వీర్యంతో ఫలదీకరణ చేసి 7 రోజులు ప్రయోగశాలలో శాస్త్రీయ విధానంలో పిండాలుగా మార్చి ద్రవ నత్రజనిలో భద్రపరుస్తారు. సరోగేట్ (అద్దె గర్భం) పశువును ఎంపిక చేసిన తరువాత అది ఎదకు వచ్చిన ఏడో రోజున భద్రపరచిన పిండాన్ని దాని గర్భంలోకి ప్రవేశ పెడతారు.

రూ.25 కోట్లతో ఏర్పాటు

చింతలదేవి వద్ద జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రానికి రూ.25 కోట్ల నిధులతో 2015లో శంకుస్థాపన జరిగింది. ఆ తరువాత కొంత కాలానికి అందుబాటులోకి వచ్చింది. అత్యాధునిక షెడ్లు, ఉద్యోగులు ఉండేందుకు అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్స్, సోలార్ విద్యుత్, వంటి నూతన హంగులతో దీనిని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నారు. పలు జిల్లాల నుండి పశు వైద్యాధికారులు పునరుత్పత్తి కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు.

ప్రాజెక్టు ఎంతో ఉపయోగం



జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం పాడి రైతులకు బాగా ఉపయోగపడుతోంది. మేలు జాతి ఆవు, గేదె దూడల ఉత్పత్తికి ఈ కేంద్రం ఎంతో దోహదపడుతోంది. వైద్యాధికారులు కూడా చొరవ చూపుతున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

– వీరెల్ల చంద్రయ్య, చింతలదేవి

మేలు జాతి దూడకు జన్మనిచ్చింది



మాకు నాటు గేదె ఉంది. చింతలదేవి ఫాంలో ముర్రా జాతి వీర్యాన్ని ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో తమ గేదెకు ముర్రా జాతి దూడ పుట్టింది. ఈ పునరుత్పత్తి కేంద్రం ద్వారా రైతులకు మేలు జరుగుతోంది. అధికారులు ఇంజక్షన్లు రైతులకు ఫ్రీగానే అందిస్తున్నారు.

– బెజవాడ ప్రకాశరావు, ఆదిమూర్తిపురం

మాలధారణం.. నియమాల తోరణం

- ఆధ్యాత్మికత పెంచుతున్న అయ్యప్ప మాల
- సామూహిక పూజలు సమైక్యతకు దోహదం
- ఏటా పెరుగుతున్న మాలధారుల సంఖ్య



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు (ఫైల్)



సామూహికంగా భిక్ష చేస్తున్న అయ్యప్పలు (ఫైల్)

కోవూరు: కార్తీక మాసం మొదలు మకర సంక్రాంతి వరకు అయ్యప్ప దీక్షల కోలాహలం కనిపిస్తుంది. ఎంతో పవిత్రత నిష్ఠతో కఠిన దీక్షలు ఆచరించిన స్వాములు ఇరుముడిలు ధరించి శబరిమల అయ్యప్పను దర్శించుకుంటారు. స్వామి దర్శనానికి ముందు 18 మెట్లు ఎక్కాలి. ఈ మెట్లను అధిరోహించడం ద్వారా అవిద్య, అజ్ఞానం తొలగిపోయి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షదారుల నమ్మకం. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేళవింపు అయ్యప్పదీక్ష మనసు శరీరాన్ని పవిత్ర చేసుకుని ఆధ్యాత్మిక చింతనతో తనను తాను మార్చుకునేందుకు 41 రోజుల దీక్ష ఉంటుంది. హరిహరసుతుడు అయ్యప్ప. అయ్య అంటే విష్ణువు, అప్ప అంటే శివుడు అనే పేర్ల సంగమంతో అయ్యప్ప నామం ఆవిర్భవించింది. మహిషి అనే రాక్షసున్ని సంహరించి అయ్యప్ప కేరళలోని శబరిమలలో వెలిశాడు. దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రాల్లో శబరిమల అయ్యప్ప ఆలయం ఒకటి.

దీక్షలో ఆధ్యాత్మికం..

మానవ విలువలను పెంపొందించుకునేందుకు అయ్యప్ప దీక్ష దోహదపడుతుంది. మాలధారణ, నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం, విభూతి, చందనం, కుంకుమతో అలకరించుకోవడం ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై భస్మధారణ ఈశ్వర సంకేతానికి, నుదిటిపై మెరిసే తిరునామం విష్ణు మూర్తిని గుర్తుచేస్తుంది.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ...

41 రోజుల దీక్ష ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. భక్తి భావంతో పాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది అయ్యప్ప దీక్షలను తీసుకుంటారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా, సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థను ఉత్తేజపరచడం, నేలమీద పడుకోవడం ద్వారా వెన్నునొప్పుల సమస్యలు తగ్గిపోవడం, కండరాల పటిష్టత , రక్తప్రసరణ వ్యవస్థ మెరుగునకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనసు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఏటా వేలాది మంది అయ్యప్ప మాల ధరిస్తుంటారు.

మాలధారణతో మార్పునకు అవకాశం



అయ్యప్పదీక్ష నియమాలు ఎంతో కఠినంగా ఉంటాయి. ఆధ్యాత్మిక చింతనతో తనను మార్చుకునే అవకాశం ఉంటుంది. మనసు ప్రశాంతతో పవిత్రంగా ఉంటుంది. అయ్యప్పమాల ధరించడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుంది. మనసు, శరీరాన్ని పవిత్రం చేసుకోవడం అయ్యప్ప మాలధారణ ప్రత్యేకత. నిష్ఠతో దీక్ష చేసేవారు ఆదర్శంగా నిలుస్తారు.

– మల్లికార్జున, కోవూరు

మానవత్వ విలువలు పెంపు



అయ్యప్పమాలధారణ ఎంతో పవిత్రమైంది. మనిషిలో మానవతా విలువలు పెంపొందుతాయి. గత పదేళ్లుగా అయ్యప్పమాల ధరిస్తున్నా. నడవడికలో ఆరోగ్యంలో జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. క్రమశిక్షణ అలవడుతుంది. భూతదయ కలిగిఉంటారు. అయ్యప్ప మాలధారణ నియమాలు ఎదుగుదలకు దోహదపడతాయి.

– రాజశేఖర్, కోవూరు.

స్నేహభావం, సమైక్యత పెరుగుతాయి



అయ్యప్ప మాలధారణ జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరూ తమ విధిని గుర్తిస్తారు. సంఘజీవిగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలో అలవర్చుకుంటారు. పూజలు, భజనల ద్వారా స్నేహభావం పెంపొందుతుంది. నడవడిక మెరుగుపడి ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుంది.

–కవరగిరి ప్రసాద్, కోవూరు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- డీఏఏబీ సమావేశంలో మంత్రి కాకాణి

నెల్లూరు (పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. మంత్రి కాకాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఈక్రాప్ ప్రక్రియ అత్యంత విలువైందని, గత సీజన్‌లో వంద శాతం ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పూర్తి చేశారన్నారు. ఈ క్రాప్ చేసుకుంటేనే పంట బీమా వర్తిస్తుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. రైతులు కట్టాల్సిన పంట బీమాను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో 148 మండలాలకు ప్రతిపాదనలు పంపగా, 103 మండలాలను కరువు మండలాలుగా ఎన్డీఆర్ఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పెన్నా డెల్టాకు సాగు నీరిచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. మెట్ట ప్రాంత రైతులకు కూడా సాగు నీరిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. కలెక్టర్ హరి నారాయణన్, జేసీ కూర్మనాథ్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కందుకూరు, కోవూరు, ఆత్మకూరు, కావలి ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఆప్కాప్ చైర్మన్ అనిల్‌బాబు, హార్టికల్చర్ వర్సిటీ బోర్డు మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ సీడ్ బోర్డు మెంబర్ కోటా చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి సుధాభారతి, నాబార్డ్ డీడీఎం రవిసింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాతాశిశు సంరక్షణకు ప్రాధాన్యం



కాన్పుల ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ సరళమ్మ

ఆత్మకూరు: ప్రభుత్వాస్పత్రుల్లో మాతా శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ కమిషనర్ జీ సరళమ్మ వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం రాత్రి ఆమె డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్‌తో కలిసి ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. కాన్పుల విభాగాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. వారానికి ఎన్ని ఆపరేషన్లు చేస్తున్నారని గైనకాలజిస్ట్ కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషా సుందరి, వైద్యులు నరసింహశాస్త్రి, బాలాజీ, సురేష్‌బాబు ఉన్నారు.

కుందేళ్ల వేటకు వెళ్లి...

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్

కొండాపురం: కుందేళ్ల వేటకు వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మర్రిగుంట పొలాల్లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కలిగిరి సీఐ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. ఎర్రబాళెం ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల మహేష్(20) కొందరు యువకులతో కలిసి కుందేళ్ల వేటకు మర్రిగుంట పొలాల్లోకి వెళ్లాడు. అక్కడ చిమ్మిలి రాఘవయ్య అనే రైతుకు చెందిన పొలంలో పందుల నుంచి పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెను తగలడంతో మహేష్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. సహచరుల సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మహేష్ మృతి చెందాడు. అనంతరం ఎర్రబాళేనికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి తండ్రి శీనయ్య ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. రైతు రాఘవయ్య చట్ట వ్యతిరేకంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేయడంతో ప్రమాదం జరిగినట్లు విచారణలో తేలిందని చెప్పారు. రైతు రాఘవయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇతర జిల్లాలకు ఆదర్శంగా నెల్లూరు డీసీసీబీ

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీసీసీబీలకు నెల్లూరు డీసీసీబీ ఆదర్శంగా నిలిచేలా బ్యాంకింగ్ కార్యకలాపాలను విస్తృతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో 70వ అఖిలభారత సహకార వారోత్సవాలను మంత్రి చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. డీసీసీబీని లాభాల బాటలో నడిపిస్తున్న చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని మంత్రి అభినందించారు. సహకార బ్యాంకులు దివాలా స్థాయికి చేరుకున్న సమయంలో దివంగత సీఎం వైఎస్సార్ రూ.195 కోట్లు షేర్ క్యాపిటల్‌గా డీసీసీబీలకు కేటాయించి సహకార రంగానికి చేయూత అందించారని గుర్తుచేశారు. అనంతరం సహకార సమైక్య పథకానికి సంబంధించి 'మీ భవిష్యత్తుకు మా సహకారం' పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, బ్యాంకు సీఈఓ సరిత, డీసీఓ సుధాభారతి, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, డీసీఏఓ తిరుపతయ్య, బ్యాంకు పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:రూ.108
లేయర్ (లైవ్)	:రూ.105
బ్రాయిలర్ చికెన్	:రూ.196
స్కిన్‌లెస్ చికెన్	:రూ.216
లేయర్ చికెన్	:రూ.178

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	:రూ.50
సన్నవి	:రూ.20
పండ్లు	:రూ.6

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట్



హత్యకేసు నిందితులను చూపుతున్న ఆత్మకూరు పోలీసులు

ఆత్మకూరు: చిన్నపాటి గొడవను మనస్సులో ఉంచుకుని కక్ష పెంచుకుని దూరపు బంధువు అయిన ఓ వ్యక్తిని కిరాయి హంతకులతో హత్య చేయించిన ఘటనలో నలుగురు నిందితులను ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఆత్మకూరు డీఎస్పీ ఎస్ కోటారెడ్డి హత్య కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. వివరాలు.. ఏఎస్‌పేట మండలం తాతిరెడ్డిపల్లికి చెందిన వల్లెపు రవీంద్ర (38) ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న ఆత్మకూరుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఆటోతో వెళ్లాడు. మరుసటి రోజు సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో భార్య రాధమ్మ ఆత్మకూరు పోలీసులకు 4వ తేదీ రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో 7న సాయంత్రం బండారుపల్లి శివారులోని మామిడితోటలో వల్లెపు రవీంద్ర అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించాడు. దీంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు కేసు విచారణ జరపగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాతిరెడ్డిపల్లికి చెందిన దేవళ్ల అనిల్‌కు మృతుడు రవీంద్ర దూరపు బంధువు. కుటుంబ మహిళల గురించి అనిల్ అసభ్యకరంగా మాట్లాడుతుండడంతో రవీంద్ర పలుమార్లు ఫోన్‌లో మందలించాడు. దీనికితోడు తనకు ఇవ్వాల్సిన రూ.5వేల బాకీ ఇవ్వాలని కోరాడు. దీంతో రవీంద్రపై అనిల్ కక్ష పెంచుకున్నాడు. ఆత్మకూరుకు చెందిన చల్లా పవన్‌కళ్యాణ్‌రెడ్డి, షేక్ సనావుల్లా, షేక్ తొగరుల్లాలతో మంతనాలు జరిపి రవీంద్రను చంపితే రూ.2 లక్షల సుపారి ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఈ మేరకు సనావుల్లా, తొగరుల్లా పథకం ప్రకారం ఈ నెల 3న బండారుపల్లి మామిడితోటలోని మరమ్మతులకు గురైన మోటారును తీసుకురావాలని రవీంద్ర ఆటోను అద్దెకు మాట్లాడుకున్నారు. తోటలోకి తీసుకెళ్లి తరువాత అప్పటికే అక్కడ కాపుకాచి ఉన్న అనిల్, పవన్ కళ్యాణ్‌రెడ్డి కర్రతో రవీంద్రపై దాడి చేసి గాయపరిచారు. అనంతరం ఆటో స్టార్ట్ చేసే తాడుతో రవీంద్ర మెడకు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి నిందితులు పరారయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారణ జరిపిన పోలీసులు నిందితులను గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ జి వేణు, ఎస్సైలు ముత్యాలరావు, సాయిప్రసాద్‌ను డీఎస్పీ అభినందించారు.

'కావలి తథాగతుడు డాక్టర్ డీఆర్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మృణాళిని, చిత్రంలో రచయిత్రి సీ శారద

కావలి: కావలి విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి జీవితచరిత్రపై విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలికొండ శారద రచించిన 'కావలి తథాగతుడు డాక్టర్ డీఆర్' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విశ్వోదయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జవహర్ భారతి ఎంఎం హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశ్వోదయ పూర్వ విద్యార్థి, కాలిఫోర్నియాకు చెందిన సిలికానాంధ్ర తెలుగు విభాగాధిపతి డాక్టర్ సీ మృణాళిని ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. పుస్తక రచయిత్రి శారదను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విశ్వోదయ విద్యాసంస్థల ద్వారా డాక్టర్ డీఆర్ అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, సామాజిక చైతన్యం నేర్పించే దిశగా విశ్వోదయ విద్యాసంస్థలను తీర్చిదిద్దిన వైనాన్ని వివరించారు. విశ్వోదయ రెక్టార్ డీ వినయ్ కుమార్‌రెడ్డి, రామ్ సెంటర్ బాధ్యులు కే తాతిరెడ్డి, డీ మనోహర్ రెడ్డి, జేబీ కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ జే కృష్ణప్రసాద్, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డీఈ రావి కోటిరెడ్డి, బామా వ్యవస్థాపకుడు లేబాకుల సుధాకర్‌రెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, విద్యావేత్తలు, విశ్వోదయ పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు అభ్యంతరాల స్వీకరణ

నెల్లూరు సిటీ: వైద్యారోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం, ఎస్ఎన్‌సీయూ నందు ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్స్, సపోర్టింగ్ స్టాఫ్(మహిళలు) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ ఎం పెంచలయ్య మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు www.spsr nellore.ap.gov.in/ notice/ recruitment వెబ్‌సైట్‌లో మెరిట్‌జాబితాను పొందుపరిచామని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే బుధ, గురువారాల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు రూపంలో తెలియజేయాలని కోరారు.

మైపాడుబీచ్‌లో మునిగి యువకుడి మృతి



జావీద్ మృతదేహం

ఇందుకూరుపేట: స్నేహితులతో సరదాగా సముద్రంలో మునిగేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని మైపాడు బీచ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు...అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణానికి చెందిన సయ్యద్ జావీద్(26) కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి తొమ్మిది మంది కారులో సేదతీరేందుకు మైపాడు బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో అలల ఉద్ధృతికి జావీద్ నీటమునిగి గల్లంతయ్యాడు. సహచరులు తీవ్ర ఆవేదనతో తీరం వెంబడి వెతుకుతూ ఉండిపోయారు. సుమారు గంట సేపటికి జావీద్ విగతజీవిగా మారి ఒడ్డుకు చేరుకున్నాడు. దీంతో బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న కోవూరు సీఐ డీ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అల్పపీడన కారణంగా సముద్రం కసురుగా ఉందని, తీరానికి వచ్చే వారు అప్రమత్తంగా ఉండాలని సీఐ హెచ్చరించారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున కార్తీక మాసం సందర్భంగా సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించేవారు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.